ప్రజాశక్తి

Vol. 2, no. 41

(Feb. 13, 1947)

బెజవాడ, 1947

Record no. 683

Prajāśakti

Vol. 2, no. 41

(Feb. 13, 1947)

Bejavāḍa, 1947

Record no. 683

Regd. No. 4486 4 పేజీలు అణా

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 2] బెజవాడ 13-2-47 గురువారం [సంచిక 41

పోస్టల్ సమ్మెలో పాల్గొన్న కార్మికులను పనినుండి తొలగించరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12

కేంద్ర శాసనసభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఇలా అన్నారు:

"సమ్మెలో పాల్గొన్న పోస్టల్ పనివారిని ఎవ్వరినీ పనినుండి తొలగించకూడదని ప్రభుత్వం ఖచ్చితమైన ఉత్తరువులు చేసింది."

బీహారు దురంతాల విచారణ

పాట్నా, ఫిబ్రవరి 12

ఇటీవల బీహారులో జరిగిన ఘటనలపై నిష్పాక్షిక విచారణ సంఘాన్ని నియమించేందుకు ప్రభుత్వం నిశ్చయించినట్టు రూఢిగా తెలుస్తున్నది. గాంధీజీ ఈ విషయమై సలహా ఇచ్చారు.

కమ్యూనిస్టులపై ఆరోపణ ప్రధాని పునశ్చరణ

మద్రాస్ అసెంబ్లీలో కమ్యూనిస్టు తీర్మానంపై చర్చ

మద్రాసు ఫిబ్రవరి 11

మదరాసు అర్డినెన్సును ఉపసంహరించుకొని, ఖైదీల నందరిని వెంటనే విడుదల చేయాలని కమ్యూనిస్టు సభ్యుడు కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు తెచ్చిన తీర్మానంపై మదరాసు అసెంబ్లీలో చర్చ నిన్న ముగిసింది. చర్చకు సమాధానమిస్తూ ప్రధాని ప్రకాశం గారు ఇలా చెప్పారు:

"చర్చలో అన్ని వర్గాలవారు పాల్గొన్నారు. గనక నేనెక్కువసేపు మాట్లాడను. ఆర్డినెన్సుకు అవసరమైన పరిస్థితులను గూర్చి మీకు ముందే వివరంగా చెప్పాను. విషయమంతా సభ్యుల ముందుంచడానికి ప్రభుత్వం వెనుకాడడంలేదు. కాని, ముస్లింలీగ్ సభ్యులెందుకు ఈ తీర్మాన్ని బలపరుస్తున్నారో తెలీదు." రాష్ట్రంలో మతకలహాలు లేనందుకు ఆనందాన్ని వెలిబుచ్చి ఇలా అన్నారు:

"కారల్ మార్క్సు కమ్యూనిజానికి ఇండియాలో కమ్యూనిజానికీ సంబంధంలేదు. ఇక్కడి కమ్యూనిస్టుపార్టీకి నియమాలు, నిబంధనల్లేవు. ప్రపంచంలో దేనినీ వీరు గుర్తించరు. బొంబాయిలోవున్న ప్రధాన కార్యదర్శి కార్యక్రమాన్నిస్తూ, కొన్నాళ్ళు సరిగానే నడిపాడు. కాని తర్వాత ఆయన ధోరణి మార్చుకొని హింసకు పూనుకోవాలనుకున్నాడు. అప్పటినుండీ దౌర్జన్యం సాగుతున్నది.

పోలీసులు న్యాయశాస్త్ర ప్రవీణులట

"పరిస్థితులను బాగుపరచాలని మేము తొలినుంచీ ప్రయత్నించాము. 144 సెక్షన్లు అమలుపరచాము. ఇలాంటి విషయాల్లో పోలీసులు అతిప్రవీణులు. ఏ పద్ధతిని వారికి సూచించినా అది సామాన్య చట్టాలతో సాధ్యమా కాదా వారు సలహా యిస్తారు. వీలైనన్ని మార్గాల్లో ఉన్న చట్టాలను వారు ఉపయోగించారు. సమయం వచ్చినప్పుడు మేము చేసినదంతా వివరిస్తాము.

"ఎక్కువ భాగం ఇబ్బందులు కొన్ని పత్రికలు రెచ్చగొట్టే వ్రాతలవలన ఏర్పడ్డాయి. ఆ వ్రాతలను ఈ రాష్ట్రంలో తప్ప ఇంకెక్కడా సహించి ఉండరనుకుంటాను. సరమట ఒక మళయాళం పత్రిక, మదరాసులోని ఒక తమిళపత్రిక, బెజవాడలోని ఒక తెలుగు పత్రిక చాల గందరగోళం చేశాయి. మేము ముందే ఆర్డినెన్సును తేవలసింది. కాని అనవసరంగా తీవ్ర అధికారాలు ప్రభుత్వం చేతపుంచుకొన్నదని అంటారని ఊరకున్నాము. మా ప్రయత్నాలన్నీ విఫలమయ్యాకనే ఇందుకు పూనుకున్నాము.

"కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌వాదులు జైళ్ళనుండి వస్తూనే తీవ్ర ప్రచారం ఆరంభించారు. వారిని ఆపడం ప్రభుత్వానికి కష్టతరమయింది. కాంగ్రెస్ అహింసా సత్యబద్ధంగనక కమ్యూనిస్టులు కాంగ్రెస్ వేదికను ఉపయోగించుకున్నారు. అయినా కాంగ్రెస్‌ను కదపలేక ప్రభుత్వాన్ని ధిక్కరించమని ప్రజలను బోధించ నాగారు.

యూరపియన్ సభ్యుని మాట నిజమట

"ఈ యేడు పంటలను స్వాధీనం చేసుకోవటం మీదనే తమ భవిష్యత్తు ఆధారపడి ఉందని కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి సభ్యులకు ఆజ్ఞలిచ్చారు. కరపత్రాలు విరివిగా వీరు పంచిపెట్టారు. యూరపియన్ సభ్యుడు పరిస్థితిని చక్కగా వర్ణించాడు. ఆయన హృదయం సక్రమమార్గంలో ఉన్నది. లీగుపార్టీ నాయకునికి కూడ మేము చేసినది మంచి పని అని తెలుసు.

"కమ్యూనిస్టులు, మానవుల ప్రాథమిక హక్కులన్నిటిని మేము కాలరాచివేస్తున్నామంటున్నారు. మేము తీసుకున్న చర్యలు సమర్థనీయములని తంజావూరు మొదలైన జిల్లాల ప్రతినిధులు చెప్పారు."

తర్వాత లీగ్‌నాయకుడు ప్రస్తావించిన వానియంబాడి సంఘటనను వివరించి అక్కడ పరిస్థితి విషమించిందని, అక్కడ శాంతి నెలకొనేందుకు తాను సర్వవిధాల ప్రయత్నించాలని ప్రధాని చెప్పి ఇలా అన్నాడు.

"కమ్యూనిస్టు చర్యలు ప్రభుత్వాన్ని సవాలు చేస్తున్నవి. స్వంత భూములను ఆక్రమించుకొనివోలీసులనుతమవిధిని నిర్వర్తించనీకుండా చేస్తున్నారు. పరిశ్రమలలో తగాదాలు తెస్తున్నారు. రైతులను సామాన్య ప్రజలను తప్పుదారి పెట్టడం చాల సులభం. పూర్వంకన్నా ఈ పదినెలల్లో ప్రజల సంగతి చాల తెలుసుకొన్నాను. నేను పొరబాట్లు చేసి ఉండొచ్చు. కాని చాల ఆలోచించే చేశాను.

బిల్లు త్వరలో తెస్తాము

"బిల్లొకటి తయారవుతున్నది. ఈ సభలోను, పార్టీ సమావేశంలోను వచ్చిన సలహాలను జాగ్రత్తగా ఆలోచించి బిల్లు తయారు చేస్తాము. ఆ బిల్లు అందరికీ తృప్తికరంగా ఉంటుందని ఆశిస్తున్నాము. అవసరమైనదానికంటే ఒకరోజు కూడ దానిని ఉపయోగించము అరెస్టులు, డిటెన్షన్లను చూసి ప్రభుత్వంపై వైముఖ్యం పూనకండి. రాష్ట్రంలో ఆహారపదార్థాల దోపిడీలు, కాల్పులు సాగుతున్నవి. కమ్యూనిస్టుల సవాలు సంగీకరించి నేటి పరిస్థితులు సాగకుండా ప్రభుత్వం చూస్తుంది. కాబట్టి ఈ తీర్మానాన్ని త్రోసివేయమని నేను కోరుతున్నాను."

ప్రధాని ఆరోపణలకు కామ్రేడ్ వెంకటేశ్వర్లు జవాబు

తర్వాత కామ్రేడ్ వెంకటేశ్వర్లు సమాధానమిస్తూ ఇలా అన్నారు.

"కమ్యూనిస్టులపై చేసిన ఆరోపణలన్నీ యదార్థమైనవికావు. తొలినుంచీ కమ్యూనిస్టుల కార్యకలాపాలకు అపార్థాలు కలిపించడం మామూలయి పోయింది. నేడున్న అశాంతి ఆందోళనలకు మూలకారణం ఆర్థిక వ్యవసాయిక ఇబ్బందులే. ఉదాహరణకు తంజావూరులో మిరాశీదార్ల మధ్యవర్తి తీర్పును అమలు జరపడానికి నిరాకరించడంవల్లనే తగాదా ఏర్పడింది."

తర్వాత వెంకటేశ్వర్లుగారు ప్రధాని ప్రస్తావించిన ఘటనలను విపులంగా పరిశీలించి ప్రధాని ప్రకటనలో అబద్ధాలున్నాయన్నారు అబద్ధమనే మాటను ఉపసంహరించుకొమ్మని స్పీకర్ చెప్పగా ప్రధానిపై వ్యక్తిగతమైన ఆరోపణ కాదని ప్రకటనలోని సంగతులను గూర్చి చెప్పానని వెంకటేశ్వర్లుగారని ఆ మాటను ఉపసంహరించుకున్నారు.

జాతీయోద్యమానికే దెబ్బ

"ఈ ఆర్డినెన్సు జాతీయోద్యమానికే పెద్ద దెబ్బ. కమ్యూనిస్టుపార్టీ బలం పెరిగిపోతుండడం చూచి ప్రభుత్వం ఈ ఆర్డినెన్సును తెచ్చింది. ఆర్థిక ఇబ్బందులతో పరిశ్రమ కేంద్రాలలో వస్తున్న సమ్మెలకు, లాకౌట్లకు కమ్యూనిస్టులపై బాధ్యత ఆరోపిస్తున్నది."

ఇంకా వెంకటేశ్వర్లుగారి ఉపన్యాసం ముగియలేదు. మరుసటి రోజుకు చర్చ వాయిదా పడింది.

నేటి చర్చ తర్వాత వెంకటేశ్వర్లుగారి తీర్మానము ఓడిపోయింది. (వెంకటేశ్వర్లుగారి ఉపన్యాసం పూర్తిగా రేపు ప్రచురిస్తాము)

పంజాబు లీగర్ల పౌరహక్కుల పోరాటం

షెడ్యూల్డు జాతులు కూడా పాల్గొంటున్నారు

లాహోరు, ఫిబ్రవరి 11

పౌరహక్కులకొరకై పంజాబులో ప్రారంభమైన పోరాటం నూతన రూపం ధరిస్తూంది. నేడు షెడ్యూల్డు జాతులకు చెందిన 5 గురు శిక్కులు (అంబేద్కరు అనుయాయులు) ముస్లింలతో కలిసి పంజాబు ప్రజారక్షణ ఆర్డినెన్సును ధిక్కరిస్తూ ఊరేగింపు జరిపారు. ఈ ఊరేగింపులోని 51 మంది అరెస్టు చేయబడ్డారు.

లాఠీచార్జీలో ఒకరి మరణం

నిన్నను జీలంలో లీగర్ల ఊరేగింపుపై పోలీసులు జరిపిన లాఠీచార్జీ ఫలితంగా మహమ్మద్ షరీఫ్ అనే లీగు అనుయాయి ప్రాణాలు కోల్పోయాడు.

"సామ్రాజ్య తత్వాన్ని సర్వత్రా నిర్మూలించాలి"

ఇంగ్లీషు కార్మికుల నినాదం

లండన్, ఫిబ్రవరి 11

ఇంగ్లాండులోని భారతీయ, ఆఫ్రికన్ సంస్థలన్నీ కలిసి "సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించాలి" అన్న నినాదంతో పెద్ద ఉద్యమాన్ని నడప నిర్ణయించుకున్నారు. ఈ ఉద్యమానికి లాంకషైర్, యార్క్‌షైర్, దర్హామ్, మొదలైన పరిశ్రమ కేంద్రాలలోని బలసంపన్నములైన కార్మిక సంస్థలన్నీ తోడ్పడుతున్నవి.

ఈ క్రింది అంశాలపై వీరు ఉద్యమం సాగిస్తారు. (1) భారతదేశానికి అధికారమప్పగించాలి. (2) దక్షిణాఫ్రికాలో భారతీయులను సమానంగా చూడాలి. (3) ట్రినిడాడ్, ఇండోచైనా, మొదలైనచోట్ల బయలుదేరిన ఆందోళనలను బలపరచాలి.

లాంకాషైరు ఇండియా లీగు కార్యదర్శి రస్సెల్ టాల్‌బోట్ ఇలా అన్నారు: "వారానికి యాభై తీర్మానాల చొప్పున ఒక్క ఉత్తర ఇంగ్లాండులోని కార్మిక సంఘాలనుండే ఇండియా ఆఫీసుపై గుప్పింపబడుతున్నవి. భారతదేశంలోని ప్రతిష్టంభన పరిష్కారమై తీరాలని కార్మికులు చాల ఆందోళనతో కోరుతున్నారు.

దక్షిణాఫ్రికా వాసులకు తోడ్పాటు

"ఇక వచ్చే వారంలో నీగ్రో ఆఫ్రికా సమాఖ్య, నూతన అంతర్జాతీయ సమితి ఆందోళనలను బలపరుస్తూ అనేక కార్మికసంస్థలు తీర్మానాలు చేసి లండన్‌లోని దక్షిణాఫ్రికా హైకమీషనరుకు పంపుతారు.

"దక్షిణాఫ్రికా ప్రభుత్వచర్యంపై తమకు పెత్తనమేమీ లేదని బ్రిటిష్ ప్రభుత్వం మాకు చెబుతున్నది. కాని ఏమైనప్పటికీ, దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని ఈ విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం నైతికంగా బలపరుస్తున్నది. దానికి మేము ప్రధానికి అసమ్మతి తెలియజేస్తున్నాము."

సామ్రాజ్యవాదం నిర్మూలించాలన్న ఉద్యమం వివరాలన్నీ రేపు జాతీయసంస్థల, కార్మికసంస్థల నాయకుల సమావేశంలో నిర్ణయిస్తారు.

భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిని, దక్షిణాఫ్రికా భారతీయులమీదల అవలంబిస్తున్న వైఖరిని, ఇండో-చైనాలో ఫ్రెంచివారి వైఖరిని ఖండిస్తూ ప్రభుత్వానికి వేలకువేల తీర్మానాలు, దరఖాస్తులు పంపబడతాయి.

ఉత్తర ఇంగ్లాండులోని జాతీయ సంస్థల మహాసభ లివర్‌పూలులో మార్చి 22వ తేదీన జరుగుతుంది. తర్వాత పెద్ద బహిరంగసభ కూడా ఏర్పాటు చేస్తారు.

కాంగ్రెసు పాలనలో డిటెన్యూల దుస్థితి

అడ్వైజర్ల రాజ్యంలోకన్నా అధ్వాన్నం

(మా విలేఖరి)

మద్రాసు, ఫిబ్రవరి 10

నేరారోపణ, విచారణలతో నిమిత్తంలేకుండా తీసుకుపోయి రాయవేలూరు జైలులో డిటైన్ చేసినవారికి ఇస్తూన్న సౌకర్యాలను గురించి కాంగ్రెసు న్యాయశాఖామంత్రి కె. భాష్యం కాంగ్రెస్ అసెంబ్లీ పార్టీ మీటింగులోనూ, మద్రాసు అసెంబ్లీలోనూకూడా ఒక ప్రకటన చేశారు. రాయవేలూరు జైలులో కాంగ్రెస్ పరిపాలనలో డిటెన్యూలకు ఇవ్వబడుతూన్న సౌకర్యాలు (?) చూస్తే న్యాయశాఖా మంత్రి ప్రకటనలోని ఔదార్యం తెలిసిపోతుంది.

ఆహారం

అడ్వయిజర్ల కాలంలో 'ఎ' తరగతి డిటెన్యూలకు ఆహారానికై రోజుకు రు. 1-14-0 లు ఇచ్చేవారు. తర్వాత తరగతులు రద్దుచేయబడి అందరికీకూడా అదే భత్యం ఇవ్వబడింది. కాని, ఇప్పుడు డిటెన్యూలకు రోజుకు ఇస్తూంది 12 అ. 6 పైసలు మాత్రమే. బయట ఏ పట్టణంలోనూ పూటకు 0-12-0 కు తక్కువకు భోజనం దొరకడంలేదు. అంటే కాంగ్రెసు ప్రభుత్వం రాజకీయ ఖైదీలకు ఒక్కపూట మాత్రమే తిండి పెడుతూన్నదన్నమాట.

బట్ట

అడ్వయిజర్ల కాలంలో డిటెన్యూలకు దుస్తులకై ఏటాదికి 60 రు. లు భత్యం ఇస్తున్నారు. ఇప్పుడు కాంగ్రెసుపరిపాలనలో బి. క్లాసు ఖైదీలకిచ్చే గుడ్డలు మాత్రమే యిస్తున్నారు.

లాకప్

అడ్వయిజర్ల కాలంలో డిటెన్యూలకు లాకప్ లేదు. నేడు రాత్రి 8 గంటలు మొదలుకొని ఉదయం 8 గంటలవరకు శిక్షితులందరిలాగే కొట్లలో లాకప్ చేస్తున్నారు.

జాబులు

అడ్వయిజర్ల కాలంలో డిటెన్యూలకు నెలకు 16 జాబులు 4 ఇంటర్వ్యూలు ఇవ్వబడినాయి. కాంగ్రెస్ ప్రభుత్వంచేత డిటైన్ చేయబడినవారినుండి ఇంతవరకు 15 రోజులు గతించినా జాబులు రావడంలేదు. డిటెన్యూల భార్యలకు, లీగల్ ఎడ్వయిజర్లకు కూడా ఇంటర్వ్యూలు ఇవ్వలేదు.

వ్యాయామం

అడ్వయిజర్లకాలంలో డిటెన్యూలకు జైలు గోడలవెలుపల షికారు పోయిరావడానికి అనుమతించారు. నేడు జైలు గోడలలోపల కూడా అనుమతింపబడడంలేదు. వారువున్న ప్రదేశంలోనే అటూఇటూ తిరుగనిస్తున్నారు.

ఇవన్నీ చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం డిటెన్యూలయెడ ఎంతరాజకీయ కక్షతో వ్యవహరిస్తూందో తెలుస్తుంది. విచారణ, శిక్షలేకుండా తీవ్రనిర్బంధాలకు గురిఅవుతూన్న మన ప్రజానాయకులకు ఉచిత సౌకర్యాలు చూపవలసిందని అన్నిపార్టీలవారు కలగచేసుకొని మంత్రివర్గంమీదఒత్తిడి తీసుకురావాలి. తమరు పడుతూన్న ఇబ్బందులకు నిరసన తెలుపుతూ వేలూరు డిటెన్యూలు ఫిబ్రవరి 8 తేదీన ఒకరోజు నిరశనవ్రతంచేశారు.

తిరుచునాపల్లి జైల్లో కమ్యూనిస్టు ఖైదీల దురవస్థ

అనంత నారాయణన్‌గారి ఖండన

మద్రాసు, ఫిబ్రవరి 10

కె. వి. అనంతనారాయణన్ గారిలా వ్రాస్తున్నారు: (మిగతా 4 వ పేజీలో)

విప్లవం వస్తోంది

ఆతర్వాతనే స్వతంత్రం

డాక్టర్ ఖాన్‌సాహెబ్ ప్రకటన

పెషావర్, ఫిబ్రవరి 11

మర్దాన్‌లో జరిగిన కాంగ్రెసు సభలో సరిహద్దురాష్ట్ర ప్రధాని డాక్టర్ ఖాన్‌సాహెబ్ ఇలా ఉపన్యసించారు.

"భారతదేశంలో విప్లవం వస్తున్నది. ఆ విప్లవం తర్వాతనే స్వతంత్రం రాగలదు. అందులో మనమెన్నో త్యాగాలు చేయవలసివున్నది. ఐక్యత, పరస్పర సహనభావం, ఓర్పు వీనితో భారతీయులు స్వతంత్రాన్ని సాధించగల్గుతారు

"మన ఆదర్శం సంపూర్ణస్వతంత్రం కొందరు స్వార్థపరులు చీలించి పాలించాలనే సూత్రాన్ని అనుసరించి మన లక్ష్యాన్ని తప్పుమార్గాలు పెడుతున్నారు వారిమాటలు మనం లెక్కపెట్టరాదు

"మీరు ముస్లింలీగుకు కాక కాంగ్రెస్‌కే ఓటివ్వాలి. లీగు చర్చిల్ సాయంతో స్వతంత్రానికి అడ్డుపడుతున్నది."

ప్రజాశక్తి
1947 ఫిబ్రవరి 13 : గురువారం

చీల్చి పాలించే సామ్రాజ్యవాదుల వలలో పడవద్దు!

సోదర దేశభక్తులను బంధించడం, స్వాతంత్ర్యోద్యమానికి ప్రమాదం!

ప్రధాని ప్రకాశంగారికి కాంగ్రెసు నాయకుల హెచ్చరిక

వ్యవసాయ ఆదాయపు పన్ను కాంగ్రెస్‌పార్టీ నిర్ణయం

1944 లో అడ్వైజర్ల ప్రభుత్వం 5 వేల రూపాయలకు మించిన వ్యవసాయ ఆదాయం పైన పన్ను విధించాలని ఒక బిల్లును ప్రకటించింది. జమీందారులు, భూస్వాములు అందుకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. రైతుసంఘాలు పన్నును ఆహ్వానించాయి. 500 రూపాయలకు లోపు ఆదాయం వచ్చే చిన్న రైతులపై భూమిపన్ను రద్దు చేయాలని కోరాయి.

అడ్వైజర్ల ప్రభుత్వం భూస్వాములు, జమీందార్ల ఒత్తిడికి లొంగిపోయింది. వ్యవసాయ ఆదాయంపై పన్నువేసే తమ బిల్లును ఉపసంహరించుకొంది.

కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలోకి వస్తూనే అదే బిల్లును శాసనం చేస్తామని ప్రకటించింది. ఈసారి అసెంబ్లీసమావేశంలో యీబిల్లు చర్చకువస్తుందనికూడ తెలుపబడింది.

కాని 9 వ తేదీన జరిగిన కాంగ్రెసు శాసనసభాపార్టీ సమావేశంలో యీ విషయం చర్చ జరిగి, ఈ బిల్లును ప్రస్తుతం అసెంబ్లీలో ప్రవేశ పెట్టకుండా వాయిదా వేయడానికి నిర్ణయింపబడింది. బిల్లును వ్యతిరేకించుటూ పార్టీలోని ప్రముఖులు వింతవాదనలు చేశారు.

డాక్టర్ రాజన్, నాచియప్పగౌండర్‌గార్లు యిలా వాదించారట. దీనిని శాసనం చేయడం వల్ల రాష్ట్రంలో ఆహార పంటల ఉత్పత్తి దెబ్బ తింటుందట. ఈమధ్య వ్యవసాయ ఉత్పుత్తుల ధరలు విపరీతంగా పెరిగినందున వ్యవసాయదారుల కొత్తపన్నుల భారాన్ని మోయలేరని అందుచే అగ్రికల్చరల్ ఇన్‌కమ్‌టాక్సు వేయరాదని వాదించారు.

అసలు సంగతి 5 వేలు పైన ఆదాయం వచ్చే భూస్వాములు, జమీందారులు వ్యవసాయదారులే కాదు. వారిలో నూటికి 99 మంది వ్యవసాయం స్వంతంగా చేయరు. కౌలుకిస్తారు. లేదా పాలేర్లద్వారా చేయించరు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగినమాట నిజమే గాని వాటివల్ల బాధపడుతున్నది యీ పన్ను చెల్లించవలసివచ్చే భూస్వాములు, జమీందారులు కాదు.

రెండో విషయం: భూస్వాములు, జమీందార్ల పైన ఆదాయపు పన్ను విధించడంవల్ల ఆహార పంటలు తగ్గుతాయనడంలో అర్థం లేనేలేదు. అసలు దున్ని, సాగుచేసి పండించే రైతులకు కౌలుదార్లకు యీ పన్ను వర్తించదు. అందుచేత రైతులను, కౌలుదార్లను దోచుకొని ఆదాయం గడించి బొజ్జలు పెంచుతున్న జమీందారుల, భూస్వాముల పైన ఆదాయపు పన్ను వేయడంవల్ల పంటలు ఏమీ తగ్గవు.

పండించే రైతులపై భారం తగ్గించాలి. రు. 500 లోపు ఆదాయం వచ్చే వ్యవసాయదారులపై భూమిశిస్తు వేయరాదని రైతు సంఘాలు చాలకాలంనుంచి ఆందోళన చేస్తున్నాయి. ఈ పనిచేస్తే ఆహారధాన్యాలు పండించే రైతులకు ఉత్సాహం వస్తుంది. దీనితోపాటు ఆహారపంటలు ఎక్కువగా పండించే రైతులకు బోనసు కూడ యివ్వవచ్చు.

కాంగ్రెసుపార్టీ సమావేశం యీ బిల్లును వాయిదా వేయడానికి అంగీకరించి, అడ్వయిజర్ల ప్రభుత్వంమాదిరిగానే జమీందార్ల, భూస్వాముల ఒత్తిడికి లొంగిపోయింది. ఇదేవిధంగా కాంగ్రెసు మంత్రివర్గం జమీందారీల రద్దువిషయంలోకూడ నామమాత్రంగా తీర్మానంచేసి సంతృప్తి పడింది. రెండో వైపున 1802 పర్మనెంటు సెటిల్మెంటు ప్రకారం జమీందార్ల హక్కులను పునరుద్ధరించుటమని ఒకబిల్లును ప్రవేశపెట్టింది. ఈ పనులన్నీ, కాంగ్రెసుపార్టీపైన జమీందారీ భూస్వామికవర్గాల పలుకుబడి ఎంతవని చేస్తుందో రుజువుచేస్తున్నవి.

కాంగ్రెసుపార్టీ సాగుచేసేరైతులపట్ల యేమాత్రం గుర్తించడంలేదు. అధికపంటలు పండించటానికి, ఆహారకరువును తీర్చడానికి భూమిని దున్నేకర్షకునికియేమాత్రం ప్రోత్సాహం ఇవ్వడంలేదు.

జమ్మలమడుగు తాలూకా కాంగ్రెసు సభ్యుల ఖండన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7

జమ్మలమడుగు తాలూకా కాంగ్రెసు సభ్యులు అయిన శ్రీ వి. కుప్పాయిరెడ్డి, వి. జంగంరెడ్డిగార్లున్ను, కొట్టాలపల్లి గ్రామ కాంగ్రెసువాదులైన శ్రీయుతులు ఎల్. సుబ్బారెడ్డి, కె. పుల్లారెడ్డిగార్లున్ను ఈవిధంగా ప్రకటిస్తున్నారు.

గవర్నరు జారీచేసిన 'ప్రజాశాంతి రక్షణ' ఆర్డినెన్సును ప్రకాశంగారు బలపరుస్తూ, తత్సంబంధమైన బిల్లును తీసుకురావడానికి ప్రయత్నించడం చాలా శోచనీయం.

అరవై ఏండ్లనుండి నిరంకుశ పోలీసు అధికారాలకు వ్యతిరేకంగాపోరాడినకాంగ్రెసు సంస్థలోని సభ్యులైన మేము దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. సోదరదేశభక్తులైన కమ్యూనిస్టులకొరకే ఈ చట్టం చేయాలనేదిభావం స్వతంత్ర ఉద్యమానికి మరింత ప్రమాదం. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అధికారంలో ఉండగా ఈ చట్టాన్ని అమలు జరపడం — సామ్రాజ్యవాదులకూ, వారి తొత్తులైన జమీందార్లకూ, మిల్లుయజమానులకూ, తిండి దొంగలకూ సహాయం చేయడమే అవుతుందని భావిస్తున్నాం.

కాన ఈఆర్డినెన్సును రద్దుచేస్తూ వెంటనే అరెస్టుచేసిన కమ్యూనిస్టులను, యితర ప్రజా సంస్థనాయకులను విడుదల చేయవలసిందిగా కోరుతున్నాం.

ఒంగోలు తాలూకా కిసాన్ కాంగ్రెసు కమిటీ సభ్యుడు

పెదమలూరు, ఫిబ్రవరి 6

ఒంగోలు తాలూకా కిసాన్ కాంగ్రెసు కమిటీ సభ్యులు శ్రీ బి. వి. సుబ్బయ్యచౌదరి గారు యిలా ప్రకటిస్తున్నారు:

ఇదివరకే పోలీసు నిరంకుశత్వం విపరీతముగా వున్నది. దానిని ప్రజా మంత్రివర్గం సర్వనాశనం చేయుటకుమారు వారికి విపరీత అధికారములిచ్చు దేశరక్షణ ఆర్డినెన్సును జారీచేయుట గ్రామ జీవితమునే నాశనము చేయునని హెచ్చరించుచున్నాము.

బ్రిటిష్ ప్రభుత్వం పన్నిన వలలో పడక అందరికీ తిండి, అందరికీ బట్ట కావలయుననే కమ్యూనిస్టుపార్టీ నాయకులను విడుదలచేసి ఆర్డినెన్సును ఉపసంహరించమని కోరుచున్నాము.

విద్యార్థి కాంగ్రెసు అధ్యక్షుడు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6

సత్తెనపల్లి విద్యార్థికాంగ్రెసు అధ్యక్షులు శ్రీ యస్. నరసింహారావుగారు యిలాప్రకటిస్తున్నారు.

ప్రస్తుతము మద్రాసురాష్ట్రంలో జరుగుచున్న కమ్యూనిస్టుల అరెస్టులు, వారి ఆఫీసులపై దాడులు మున్నగునవి చాలా విచారకరము. ఈ ఆర్డినెన్సును జాతీయప్రభుత్వం చేయవలసినదికాదు. అద్వయిజరీ ప్రభుత్వము అమలుజరుపు ఆర్డినెన్సులను ప్రజా మంత్రివర్గముచేయుట మిక్కిలి శోచనీయం; కావున వెంటనే విరమించి పాలిండు బ్రిటిష్ దమననీతిని గ్రహించి ఆర్డినెన్సును ఉపసంహరించుకొనవలసినదిగా మద్రాసు మంత్రివర్గమును కోరుచున్నాము.

శ్రీకాకుళం గ్రామ కాంగ్రెసు అధ్యక్షుడు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 10

దివితాలూకా కాంగ్రెసు కమిటీ సభ్యులు శ్రీకాకుళం గ్రామ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ పి. వి. కృష్ణమూర్తిగారు యిలా ప్రకటిస్తున్నారు.

మద్రాసు ప్రభుత్వపు ఆర్డినెన్సు ప్రజల ప్రాథమిక హక్కులను భంగపరచుచున్నది. గాన ప్రభుత్వంవారు ఆర్డినెన్సును ఉపసంహరించుకుంటూ అరెస్టు చేయబడిన అన్ని రాజకీయ పార్టీలసభ్యులనూ విడుదల చేయవలసిందిగా కోరుతున్నాను.

తాలూకా కాంగ్రెసు అధ్యక్షుడు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 7

కడపజిల్లా జమ్మలమడుగు తాలూకా కాంగ్రెసుసంఘ అధ్యక్షుడును, జిల్లాకాంగ్రెసు కమిటీ సభ్యుడును అయిన శ్రీ ఆర్. సీతారామయ్యగారు ఈ క్రింది విధంగా ప్రకటిస్తున్నారు:

భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వపోలీసు డిపార్టుమెంటులు. తాత్కాలిక ప్రభుత్వ సమ్మతిలేకుండా భారత కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుపైనను, దేశం మొత్తంమీద ఇతర కమ్యూనిస్టు కార్యాలయాలపైనను దాడిచేయడము, వారంటులు లేకుండా సోదాలు, అరెస్టులు చేయడం ప్రతి ఒక్క దేశభక్తుడు ఖండించవలసిన విషయం. ఈ విధంగా చేయడం సామాన్య పౌరసత్వహక్కులకే భంగకరం.

జిల్లా ఆహారసంఘ సభ్యుని నిరసన

బందరు, ఫిబ్రవరి 4

కృష్ణాజిల్లా ఆహారకమిటీ సభ్యులు-పట్టణ కాంగ్రెసు కమిటీ సభ్యులు అయిన వట్టూరి సుబ్బారావు బి. యె. బి. యల్. గారు యిలా ప్రకటిస్తున్నారు.

మద్రాసు ప్రభుత్వం జారీచేసిన 'ప్రజా శాంతి రక్షణ' ఆర్డినెన్సు ప్రజాభీష్టానికి పూర్తిగా విరుద్ధమైనది. ఈ ఒక్క ఆర్డినెన్సులోను యుద్ధకాలంలో బ్రిటిష్‌ప్రభుత్వం అమలు జరిపిన "దేశరక్షణచట్టం" లోని అన్ని హంగాలు యిమిడిఉన్నాయి. ఈ విధంగా అంతులేని అధికారాలను, తమ ప్రభుత్వోద్యోగులకు అప్పజెప్పారు. ప్రధాని ఈ ఆర్డినెన్సును ప్రయోగించడానికి ఉదహరించిన కారణాలన్నీ ఏవో కొన్ని స్థానిక ఘటనలకు సంబంధించినవే. అటువంటి స్థానిక సమస్యలను పరిష్కరించడానికి యిప్పుడున్న శాసనాలు సరిపోతాయి. అది కారంలో ఉన్న పార్టీవారు ప్రతిపక్షంల వాదనను అర్థంచేసుకోవలసిన అవుసరం ఎంతో ఉంది.

ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితులకు తగినట్టి చర్యలు తీసుకోవచ్చు. కాని యీ ఆర్డినెన్సును అమలుజరపడం వ్యక్తిస్వాతంత్ర్య సిద్ధాంతానికి పూర్తి విరుద్ధం.

ఆంధ్ర షెడ్యూల్డు ఫెడరేషన్ అధ్యక్షుడు

కాకినాడ, ఫిబ్రవరి 9

ఆంధ్రరాష్ట్ర షెడ్యూల్డుకులాల ఫెడరేషను అధ్యక్షులు సి. గోపాలకృష్ణయ్య బి.ఏ. బి. యల్. గారు యీ క్రిందివిధముగా ప్రకటిస్తున్నారు:

అధికారమునకు వచ్చిన మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గము యిప్పటికే తాము చేసిన సాధారణ శాసనచర్యలే పీడిత ప్రజానీకము నకుపుపకరించక, దోపిడీవర్గమునకు, దొంగ మార్కెట్టులకు,లంచగొండితనమునకు, కరువు, కాటకములకు దోహదమిస్తున్నవి. ఒకవంక రాష్ట్రపరిస్థితులు యిట్లుండ, మరియొక ప్రక్క యావద్భారతదేశ భవిష్యత్తురూపము ఏరూపం దాల్చునోయని ప్రతి భారతీయుడూ గంపెడాశతో వీక్షిస్తున్నాడు. ఈ సమయమున మద్రాసు మంత్రాంగము అప్రజాస్వామికమైన మార్గము అవలంబించి "ప్రజారక్షణ ఆర్డినెన్సు"ను అమలుజరపడము అన్నివిధముల అసమంజసము. తమ వినాశనమునకే కాంగ్రెసు మంత్రివర్గమునకు యిట్టి విపరీతబుద్ధి పుట్టినదని నా నమ్మకము. "ప్రజారక్షణ" అను పేరుతో సామాన్య పౌరసత్వపు హక్కులు లేకుండా చేస్తుంటే 'అది ప్రజా రక్షణా ? లేక ప్రజాభక్షణా ?

హిందీ ప్రేమీమండలి అధ్యక్షుడు

కైకలూరు, ఫిబ్రవరి 10

కైకలూరుతాలూకా హిందీ ప్రేమీమండలి అధ్యక్షులు శ్రీ యలమంచిలి రంగారావుగారు యిలా వ్రాస్తున్నారు:

పౌరస్వత్వ హక్కులపై గొడ్డలి పెట్టు లాంటి ఆర్డినెన్సును మద్రాసు ప్రభుత్వం ప్రకటించింది. అప్పుడే అనేకమంది కమ్యూనిస్టు నాయకులు అరెస్టు చేయబడ్డారు. ప్రజా ఉద్యమాలన్నిటినీ అవి ఏ రూపంలో ఉన్నా అణచటానికే యీ ఆర్డినెన్సు ఉపయోగపడుతుంది. తెల్లప్రభుత్వ కుట్ర ఫలించుతుంది. ప్రజా మంత్రివర్గానికి ఇది సిగ్గుచేటు. కనుక ప్రజా ప్రతినిధులు ఇప్పుడైనా బిల్లు రూపంలో తెచ్చే ఆర్డినెన్సును ఉపసంహరించుకొని, అరెస్టు చేయబడ్డవారిని విడుదలచేసి, రాష్ట్రములో తిరిగి పౌరస్వత్వ హక్కులను నెలకొల్ప వలసినదిగా ప్రభుత్వములోయున్న ప్రజానాయకులకు సవినయముగా మనవి చేయుచున్నాను.

మాజీ సైనికాధికారి ఖండన

హరిపురం, జనవరి 31

శ్రీ జి. వి. సుబ్బారావుచౌదరి ఎక్సు వి. సి. ఓ., ఆర్. ఐ. ఎ. యస్. సి. గారు ఆర్డినెన్సును ఖండించుతూ యిలా ప్రకటిస్తున్నారు:

ఈరోజున ప్రతివర్గములోను ఆందోళన, సమ్మెలు జరుగుటకు, వారియొక్క దుర్భర స్థితియే కారణం. దీనికి నాయకులసమ్మెయే గుణపాఠము. మనరాష్ట్ర ప్రధాని వీటి కంతకు కమ్యూనిస్టులే కారకులనియు వీరిని అణచుటకు జారీచేయబడిన ఆర్డినెన్సును సమర్థించుకొనుటకు ప్రయత్నము చేయుచున్నారు. ప్రజా విప్లవపూతకులు తప్ప ప్రతిదేశభక్తుడు పదరు ఆందోళనలను వత్తా ఖను బలపర్చవలసిన విధి వారితోపాటు ఆందోళన చేయవలసిన విధికూడాను. కాని కమ్యూనిస్టులు ఎక్కువ శ్రద్ధతో పరిశీలించి వారి ఆందోళనలను సక్రమపద్ధతులతో నన్నె పెట్టుచున్నారు.

కాబట్టి మద్రాసు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరంకుశ ఆర్డినెన్సు స్వాతంత్ర్య పోరాటానికీ, ప్రజాఉద్యమాలకు తీరనిదెబ్బ. వెంటనే ప్రజాభిప్రాయాన్నమసరించి ప్రకాశంగారు ఆర్డినెన్సును ఉపసంహరించుకొని అరెస్టుచేసిన కమ్యూనిస్టు నాయకులను వెంటనే విడుదలచేస్తారని ఆశిస్తున్నాను.

సివిల్ లిబర్టీస్ (నెల్లూరు) సంపాదకీయం

భారతీయులం గత రెండు వందల సంవత్సరాల నుండి మనపై అధికారం చెలాయిస్తున్న బ్రిటిష్ వారిని గెంటి వేయడాని తీవ్ర ఆందోళన చేస్తున్నాం. బ్రిటిష్‌ప్రభుత్వం యుద్ధకాలంలో ప్రజల హక్కులను హరించే అనేక ఆర్డినెన్సులను అమలు జరిపింది. వాటినిమనమంతా ఏకగ్రీవంగా వ్యతిరేకించాం కాని శాంతి కాలములో, ప్రజా ప్రతినిధులైన కాంగ్రెసు మంత్రివర్గం "శాంతి రక్షణ" పేరుతో కనీసం హెచ్చరిక అయినాలేకుండా నిరంకుశ ఆర్డినెన్సును జారీచేయడం చాలా ఆశ్చర్యకరంగాఉంది. ఈఆర్డినెన్సు ప్రభుత్వ ఉద్యోగులకు అంతులేని అధికారాలు కట్టబెడుతూఉంది. శాసనసభాసభ్యులు దీనిని ఉపసంహరింపు కొనేటట్లుచేస్తారని ఆశిస్తున్నాం.

ఏలూరు రచయితల సభపై నిషేధం

సంఘ కార్యదర్శి ప్రకటన

బెజవాడ, ఫిబ్రవరి 9

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శి శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు యిలా ప్రకటన చేస్తున్నారు:

ఏలూరు అభ్యుదయ రచయితల మహాసభను స్థానిక పోలీసుఅధికార్లు 144 వ సెక్షను క్రింద నిషేధించారనీ, కళాప్రదర్శనలను జరుపుకోవడానికి జిల్లా కలెక్టరు అనుమతి కోరగా ఆయన అనుమతినివ్వ నిరాకరించారనీ తెలుస్తున్నది.

ఈ విధంగా వైజ్ఞానిక సభలకు ఎన్నడూ వర్తించని 144 వ సెక్షనును దుర్వినియోగపరచి, జాతీయ కళా వికాసాన్ని అరికడుతున్న అధికారులపై ప్రజా మంత్రివర్గం వెంటనే చర్య తీసుకోవాలని కోరుతున్నాను.

కొత్త రైసుమిల్లుల నిషేధం

మద్రాసు, ఫిబ్రవరి 11

కొత్తగా రైసుమిల్లులు స్థాపించడానికి ఇకమండి ఎవరికీ లైసెన్సులు యివ్వరాదని మద్రాసు ప్రభుత్వం ఆర్డర్లు జారీచేసింది.

కొత్తమిల్లులు స్థాపించబడితే వడ్లదంపుడు ప్రోత్సాహం ఉండదనీ, వడ్లదంపును ప్రోత్సహించడమే ప్రభుత్వ విధానంకాబట్టి కొత్తమిల్లులకు లైసెన్సులివ్వరాదనీ ఆర్డరులోవుంది.

మోటారు కార్మికుల సమ్మె బాలెటు

ఉరవకొండ, ఫిబ్రవరి 10

బస్సులలో ఓవర్‌లోడు వేయనందుకు, స్పెషల్ ట్రిప్పు తిరుగనందుకు ఉరవకొండ యం. బి. యస్. మోటారు కంపెనీ డైరెక్టరు శ్రీ టి. నాగప్పగారి, అవరావి మాటలతో, తిట్లు ఎక్కువగుచున్నవి. ఈ నెల్లలో పై బస్సులలో దాదాపు 120 పైగా ఓవర్‌లోడు వేసియు, 50 ట్రిప్పులకు స్పెషల్ ట్రిప్పుకూడా బస్సులు తిరిగిన సవార్లకు బత్తాలుగాని, ఓవర్‌టైము అలవెన్సుగాని యివ్వకపోగా పనిష్‌మెంట్లు ఎక్కువగుచున్నవి. బండ్లు సరియైన ఆర్డరులో లేకపోవుటచే ప్రజల ప్రాణహానీ, డబల్ ఛార్జీలు చెల్లించుకొనలేక బాధలు పడుట జరుగుచున్నది. లోగడ ఆర్. టి. ఓ. గారికి మేనేజిమెంటు వ్రాసిన అగ్రిమెంట్లు కూడా అమలుజరుపకపోవుట చేతను, డిసెంబరు నెలలో పనిచేసిన సవారులకు యీరోజువరకు 7 మందికి జీతములు యివ్వకపోవుట చేతను, పనిష్‌మెంట వలననూ,దారిద్ర్యాని జీతములతో బాధలు పడలేకమూగత్యంతరంలేక సమ్మెచేయుటకుగాను ఈ నెల 12 వ తేదీన అనంతపురం, బళ్లారి, కళ్యాణదుర్గం, తాడిపత్రి డివిజన్ల పనివారు బ్యాలెటు తీసుకొనుటకు నిర్ణయించుకున్నారు.

'నవయుగ' విద్యార్థి, యువజన పత్రిక

బెజవాడ, ఫిబ్రవరి 12

కృష్ణాజిల్లా యువజన సంఘాధ్యక్షులు శ్రీ కాటనేని సూర్యప్రకాశరావుగారిలా ప్రకటిస్తున్నారు.

విద్యార్థి, యువజన సంఘాల మాస పత్రిక 'నవయుగ' మార్చి మొదటివారంలో వెలువడుతుంది. పత్రికకు నిధి సేకరణలో విద్యార్థి సోదరులు తమ బాధ్యతలను పూర్తి చేశారు. యువజన సంఘాలుకూడా చురుకుగా కదలి నవయుగ నిధి వసూలులోనూ, చందాదారులను చేర్పించుటలోనూ పనిచేయ వలసినదిగా, ప్రాథమిక సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నాను. నిధి, చందాలు 25 వ తేదీ లోగా జిల్లా ఆఫీసుకు పంపాలి. ఈ తేదీకి అందించిన చందాదారులకే మొదటి సంచిక అందజేయగలం.

ప్రజా సేవకులకు జైళ్లు! ప్రజా పీడకులకు స్వేచ్ఛ!

ఇదేనా మంత్రివర్గ విధానం?

సత్తెనపల్లి, ఫిబ్రవరి. 10

సత్తెనపల్లి కాంగ్రెస్ సోషలిస్టు కౌన్సిల్ లేబరు ఆర్గనైజర్, గుండవరపు సోమేశ్వర రావుగారు క్రింది ప్రకటన చేస్తున్నారు.

సత్తెనపల్లి తాలూకాలో యీ క్రింద మదహరించిన బ్లాక్ మార్కెటు కేసులు యింత వరకు విచారణ జరుప బడలేదు. ప్రజా ప్రభుత్వము వచ్చినతోడనే బ్లాక్‌మార్కెటు పోవునని ఆశించితిమి. కాని ఆచరణలో అది శూన్యమైనది. యిదివరకు ఎడ్వయిజరీ ప్రభుత్వము వున్న రోజులలో జరిగినంత త్వరగా కూడా ప్రజా ప్రభుత్వములో జరుగుటలేదు. కాబట్టి యీదిగువ మదహరించిన కేసులను వెంటనేతీసికొని విచారించి శిక్ష వేయవలెను. కేసులుపట్టుకొనినవెంటనే విచారణ జరుగునట్లు చూడవలయును.

పట్టుకున్న తేదీ	సరుకు	ముద్దాయి
4-4-46	కిరోసిన్	బోలిశెట్టి వెంకటరత్నం
15-5-46	బియ్యం	కొత్తమాసు సుబ్బారావు
29-7-46	నూలు	జూలకల్లు శివయ్య (జూలకల్లు)
17-8-46	ఎక్సర్‌సైజు పుస్తకాలు	ఉయ్యూరు అక్కిరెడ్డి
20-8-46	సిమెంటు	యక్కల వెంకట్రామయ్య
29-8-46	బియ్యం	కూనిశెట్టి సుబ్బారావు
,,	,,	కొత్తమాసు సుబ్బారావు
27-9-46	మిల్లుగుడ్డ	కూరపాటి సుబ్బమ్మ
,,	బండివట్టాలు	బైసాని కృష్ణమూర్తి
28-9-46	బొన్నలు	షేక్ శిలార్ సాహెబ్ (మోతాదు, రుద్రవరం)
10-10-46	మిల్లుగుడ్డ	కొప్పరావూరిలక్ష్మయ్య (సత్తెనపల్లి) చౌట లక్ష్మయ్య (సిరిపురం)

ఈ పై కేసులను విచారణకు త్వరగా తేవలెనని ప్రజలు ఆందోళన చేయవలెను.

20 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

గంపలగూడెం, ఫిబ్రవరి 9

కొబ్బరినూనెకు కంట్రోలు ప్రకటించక పూర్వమే సరుకంతా బ్లాకుమార్కెట్టులోనికి పోయినది. వీశ 1-8 రు 8 లు పెట్టితే దొరుకుతుంది. కంట్రోలు ప్రకటించిన తరువాత వేరుశనగ నూనె మార్కెటునుంచి మాయమైనది. కలెక్టరునకు ఎన్ని లెక్కలు పంపిన తరువాత బెల్లం అసలే దొరుకుట లేదు. సామాన్య జీవితావసర వస్తువులు దొరకక యీ గ్రామ ప్రజలే గాక, యీ గ్రామంపై ఆధారపడిన చుట్టుపట్ల గ్రామాల ప్రజలుగూడ చాల ఇబ్బంది పడుచున్నారు.

ఇది యిట్లుండగా 6-2-47 తేదీ సాయంత్రం అమ్మిరెడ్డిగూడెం వర్తకుడు గంపలగూడెంలో బొడ్డు నారాయణవద్ద, మణుగు 18 రు 7 లు చొప్పున అర్ధమణుగు బెల్లం, అనుటోరు అచ్చయ్యవద్ద మణుగు రు 13 లు చొ॥ 9 వీశలు శనగనూనెను దొంగ మార్కెటులో కొని తీసుకొనిపోతుంటే, గంపలగూడెం తూర్పువాంటు మునసబుగారు పట్టుకొనివానియొద్ద పైవిధముగా స్టేటుమెంటు తీసుకొన్నాడు. కాని యీనాటివరకు రిపోర్టు పంపియుండలేదు. అమ్మిన వర్తకులతో లాలూచీ పడినట్లు ప్రజలు, యీ ఆలస్యము మూలమున, అనుకొనుచున్నారు.- అని కె. వి. నరసింహారావుగారు వ్రాస్తున్నారు.

అదనపు రేషన్ యివ్వడంలేదు

గుంటూరుడిపోదార్ల మోసం

గుంటూరు, ఫిబ్రవరి 10

గుంటూరు ఫ్యాక్టరీవర్కర్సు యూనియన్ కార్యదర్శి, ఏ. లక్ష్మణరావుగారు యిలా ప్రకటిస్తున్నారు:

కాయకష్టంచేసే కార్మికులకు అదనపు రేషన్ 4 ఔన్సులు యివ్వవలసిందిగా ప్రభుత్వము ప్రకటించింది. పట్టణంలోని కార్మిక సంఘాల ఆందోళనఫలితంగా, ముఠాకార్మికులు, ఫ్యాక్టరీలలో పనిచేయు మోతకార్మికులు, కాపీకార్మికులు మొదలైనవారు అదనపు రేషన్‌కార్డులను పొందారు.

మామూలుగా రేషన్‌తెచ్చుకునే డిపోలలోనే అదనపు రేషన్‌కూడ కార్మికులుతెచ్చుకుంటూ యుండేవారు. కాని నేడు రేషన్ డిపో యజమానులు అదనపు రేషన్‌కార్డుల మీద యివ్వవలసిన రేషన్ యివ్వనిరాకరించుచూ మరొకచోట రిజిష్టరుచేయించుకుని తెచ్చుకొనవలసిందిగా కార్మికులను నిరంకుశత్వంగా వెనక్కు పంపుచున్నారు. మొదటి నుండి అదనపురేషను యిచ్చిన బియ్యం నేడు ఏమైపోతున్నాయి ? పంచదార, కిరసనాయిలు విషయంలోకూడ చాల అక్రమాలు జరుగుతున్నాయి.

కాబట్టి ప్రభుత్వం మామూలుగా రేషన్ యిచ్చు డిపోలలోనే అదనపురేషన్ యిచ్చునట్లు ఏర్పాట్లు చేయాలి.

నూలు కోటాదారు అక్రమాలు పోలీసుల మద్దతు

వీరఘట్టం, ఫిబ్రవరి 6

ఉత్తర విశాఖజిల్లా చేనేత పారిశ్రామిక సంఘసహాయ కార్యదర్శి యీక్రిందిప్రకటన చేస్తున్నారు:

వీరఘట్టంగ్రామం (పాలకొండ తాలూకా) వున్న రామగోపాలం అనే నూలు వ్యాపారి చేనేత కార్మికులను పెడుతున్న బాధలు, జిల్లా అధికారులనుండి దిగువ వుద్యోగుల వరకు ఎన్నోసార్లు తెలియజేయబడ్డాయి. ముఖ్యంగా గత సంవత్సరం అగస్టు నుండి నేటివరకు ఈయనపైచేయబడ్డ కంప్లయింట్లు నేటివరకు విచారణ రూపంలోనే వుండిపోయినవి. గాని. ఇంతవరకు యాక్షన్ తీసుకోబడలేదు.

గ్రామపెద్దలు, ఉద్యోగులు డిప్యూటీ సూపరెంటుకూడా జోక్యం కలిగించుకోడం జరిగింది. వారిని కనిపెట్టి తిరిగిన ఈషాహుకారిని వారంతా కలసి ఏమీచేయకుండా జారవిడిచారు. జిల్లా నూలు కంట్రోలు ఆఫీసరు వద్ద నేటికి 6మాసాలనుండి, గ్రామాలనుండి వచ్చిన కార్మికుల పిటీషన్లు విచారణ కాబడుతుండగా, రెండో ప్రక్క బ్లాక్ మార్కెట్ స్వేచ్ఛగా సాగిస్తూయున్నాడు.

13-11-46 తేదీని ఇచ్చిన కోటా నూలు నుండి రెండుపెట్టెలు మాదేవలస గ్రామస్తులకు 25-11-46 వ బ్లాక్‌మార్కెట్టుకి అమ్మగా వారు తీసికొనిపోతున్న యీ నూలు గ్రామ పోలీసులు పట్టుకొన్నారు. నూలు తీసికొనిపోతున్న ముగ్గురులో ఒకరు పారిపోయినాడు. మిలిగినవారు పోలీసులు కలసి షాహుకారితో రాజీపడటం జరిగింది. ఆ కేసు నేటివరకు బయటపడకుండా చేశారు, తిరిగి 13-12-46న 5 పెట్టెల నూలు నారాయణపురం దేవాంగికి అమ్మగా, రాజనాల వెంకటనారాయణ వగైరాలు పట్టి అప్పజెప్పారు. ఈకేసులో స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టరు, గ్రామ మునసబు, షాహుకారుతో మాట్లాడి షాహుకారుకి వ్యతిరేకిగా వున్న వుగిరి పెంటయ్య అనే కార్మికునిపై త్రిప్పారు. ఈ కేసు జిల్లా నూలు కంట్రోలు ఆఫీసరుగారి సమక్షాన వీరఘట్టంలో 4-2-47 న విచారణ కాబడింది. సాహుకారు సాక్షులు పోలీసుల యెదుట ఒక విధంగాను, ఆఫీసరు యెదుట మరొకవిధంగాను సాక్ష్యం చెప్పారు. నూలు కొనుక్కొనిపోతున్న ముద్దాయి న్నీ, సబ్‌ఇన్‌స్పెక్టరుగారున్నూ విచారణనాటికి రాకుండా తప్పించుకొన్నారు. గ్రామం పెద్దలలో ఒకరైన శ్రీ కోడి నారాయణస్వామినాయుడు బి. ఏ. గారు షాహుకారు, పోలీసులు కలసి జరుపుతున్న నాటకమంతా ఆఫీసరుతో చెప్పారు. గాన ఈలాంటి వ్యాపారిద్వారా నూలు సప్లయిచేయించుటవల్ల కార్మికుల ఇబ్బందులకు అవుతుందన్న సంగతి స్పష్టంగా తేలిపోయింది.

తమిళనాడులో ఉపాధ్యాయుల ఆందోళన

తిరుచునాపల్లి

తిరుచునాపల్లి, ఫిబ్రవరి 8

తిరుచునాపల్లిజిల్లా ఉపాధ్యాయుల గిల్డు నేషనల్‌కాలేజీ ప్రిన్సిపాలు ఎ. రామయ్యర్ గారి అధ్యక్షతను సమావేశమై యీ దిగువ తీర్మానం చేసింది.

ప్రభుత్వం నిర్ణయించిన ఉపాధ్యాయుల వేతనస్కేళ్ళు చాల అక్రమము. అన్యాయముగావున్నాయి. దీనిపై వుపాధ్యాయులు తీరని అసంతృప్తిని వెంబుతున్నారు. ఒకే విద్యార్హత కలిగిన ఎలిమెంటరీ, సెకండరీ స్కూళ్ళ ఉపాధ్యాయులకు వేరువేరు స్కేళ్ళు నిర్ణయించుట చాలా అన్యాయము.

మద్రాసు ప్రభుత్వంవారు ఉపాధ్యాయుల కోర్కెలను పరిశీలించి వేతనాలను తిరిగి నిర్ణయించాలని మంత్రివర్గం వారిని కోరుతున్నాము.

పెరియాకుళం

పెరియాకుళం, ఫిబ్రవరి 5

పెరియాకుళం తాలూకా ఉపాధ్యాయుల యూనియను అల్లినగరములో ఆర్. మాసిలమణిగారి అధ్యక్షతను సమావేశమై ఈ దిగువ తీర్మానం చేసింది,

ప్రభుత్వం రివైజు చేసిన వేతనాలు ఉపాధ్యాయులయొక్క కోరికల నేమాత్రము తీర్చలేకపోతున్నవి గనుక ఉపాధ్యాయులందరూ ప్రత్యక్ష పోరాటానికి సంసిద్ధం కావలెనని యీ సభవారు కోరుచున్నారు.

హోసూరు

హోసూర్, ఫిబ్రవరి 4

హోసూర్‌తాలూకా వుపాధ్యాయులు ఆర్. వెంకట్రామన్‌గారి అధ్యక్షతను సమావేశమై ఉపాధ్యాయుల కోరికల నెరవేర్చుకోడానికి తమ యూనియన్ సౌత్ యిండియన్ టీచర్సు గిల్డు తెచ్చే పోరాటానికి సిద్ధంగా వుంటుందని తీర్మానిస్తూ 9 గురుతో కూడిన ఒక కార్యాచరణ కమిటీని యేర్పాటు చేశారు.

రివైజుడు స్కేళ్లపై ఉపాధ్యాయులఅసంతృప్తి

అధికవేతనాలకొరకు రాష్ట్రమంతటా ఆందోళన

పాలకొల్లు, ఫిబ్రవరి 8

ది 8-2-47 తేదీని పాలకొల్లులో జరిగిన సెంటరు క్లాసులో యీదిగువ తీర్మానములు చేయబడినవి.

మద్రాసు ప్రభుత్వమువారు జీతాలస్కేళ్ళు నిర్ణయంలో ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయమునకు ఈ అసోసియేషనువారు తమ అసమ్మతిని తెలియజేయుచున్నారు. ఇతర ప్రభుత్వోద్యోగులతోపాటు ఉపాధ్యాయుల కోర్కెలు మన్నింపబడక పోవుటయేగాక వివిధ మేనేజిమెంట్ల క్రిందనున్నవారికి ఒకే విద్యార్హత కలిగి ఉన్నప్పటికీ వివిధరకములుగా స్కేళ్ళు నిర్ణయించుటను గర్హించుచున్నారు. గనుక ప్రభుత్వంవారు పునరాలోచించి అన్ని మేనేజిమెంట్లలోని టీచర్లకు కూడ యీ దిగువ విధంగా స్కేళ్ళు నిర్ణయించి ఉపాధ్యాయలోకములోని అసంతృప్తిని తొలగించవలసినదిగా కోరుచున్నారు

జీతము కనీసము రు 45/- లు నుండి రు 85/- లు వరకైన సంతృప్తియగునని, శ్రీ గవర్నమెంటువారిని కోరుతూ తీర్మానించడమైనది.

గన్నవరం

గన్నవరం, ఫిబ్రవరి 10

ది 9-2-47 వ తేదీని గన్నవరంతాలూకా సమస్త ప్రాథమిక పాఠశాలోపాధ్యాయులు ఉయ్యూరులో సమావేశమై యీ క్రింది తీర్మానములు చేయడమైనది.

(1) శ్రీ మద్రాసు ప్రభుత్వమువారిచే యిటీవల ప్రకటింపబడిన ప్రాథమిక పాఠశాలోపాధ్యాయుల వేతన నిర్ణయములు యోగ్యతా సమత్వమునకుగాని, ప్రయోజన సమత్వమునకుగాని, గౌరవ సమానత్వమునకుగాని, కుటుంబ పోషణకుగాని చాలక మాకు అసంతృప్తికరంగాను, అగౌరవప్రదముగాను ఉన్నవి గాన శ్రీ ప్రభుత్వమువారు తిరిగి సమీక్షించి సంతృప్తికరమయిన న్యాయ నిర్ణయమును చేయుటకై కోరుచున్నాము.

(2) కనీస యోగ్యతగల ఉపాధ్యాయుని

విశాఖపట్టణం

వైజాగ్, ఫిబ్రవరి 8

సి. బి. యమ్. హైస్కూలు టీచర్సు అసోసియేషన్ సమావేశమై ప్రభుత్వం నిర్ణయించిన ఉపాధ్యాయుల స్కేళ్ళపట్ల తమ అసంతృప్తిని వెల్లడించారు. అది కూడా తెలుగుపండితులు, డ్రిల్లు మాష్టర్లు, డ్రాయింగు మాష్టర్లకు లేకపోవడం శోచనీయమని తీర్మానించారు.

శ్రీకాకుళం

శ్రీకాకుళం, ఫిబ్రవరి [illegible]

శ్రీకాకుళంపట్టణప్రాథమికోపాధ్యాయులు శ్రీ టి. వి. యల్ నరసింహారావుగారి అధ్యక్షతను సమావేశమై యన్. జి. ఓ. [illegible] ఉపాధ్యాయులకుకూడ బోనస్ ఇప్పించవలెననీ రాష్ట్రంలో వివిధ మేనేజిమెంట్లక్రింద [illegible] పాఠశాలలన్నింటినీ ప్రభుత్వంక్రిందికి [illegible] కొని సరియైన వేతనాలు యేర్పాటు చే[illegible]లనీ తీర్మానించారు.

నెల్లూరు

నెల్లూరు, ఫిబ్రవరి [illegible]

నెల్లూరు మునిసిపల్ ఎలిమెంటరీస్కూల్ టీచర్సు యూనియన్ సమావేశమై మునిసిపల్ ఉపాధ్యాయులకు ఇచ్చే వేతనాలు బహు స్వల్పమనీ, అందుచే ఇండ్ల అద్దె, అధికధరల కరువుభత్యం యిప్పించాలనీ తీర్మానించారు.

తిరుపతి

చంద్రగిరి, ఫిబ్రవరి [illegible]

చంద్రగిరితాలూకా ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూళ్ళ ఉపాధ్యాయులు సమావేశమై ప్రభుత్వ నిర్ణయం తమకు తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ - స్థానిక సంస్థల క్రిందనున్న ఉపాధ్యాయులకు ఒకే విధమైన వేతనాలుండాలని ఉపాధ్యాయుల జీతాలు పెంచాలనీ తీర్మానించారు.

చిత్తూరు

చిత్తూరుజిల్లా రూరల్ అండ్ అర్బన్ ఉపాధ్యాయులఅసోసియేషన్ ఉపాధ్యాయులు క్రిష్టప్పగారి అధ్యక్షతను సమావేశమై ఉపాధ్యాయులకోర్కెలు త్వరలో నెరవేర్చబడని యెడల సౌత్ ఇండియన్ టీచర్సు గిల్డువారిని పోరాట కార్యక్రమం నిర్ణయించవలసిందిగా ఈ సభవారు కోరుచున్నారు.

హిందుపూరు

హిందుపూర్, ఫిబ్రవరి [illegible]

హిందుపూరు ఎలిమెంటరీస్కూళ్ళ ఉపాధ్యాయుల సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించినస్కేళ్ళు ఎడ తీవ్ర అసంతృప్తిని ప్రకటిస్తూ ఒకే విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులకు రెండు తరగతుల స్కేళ్ళ నిర్ణయాన్ని మార్చాలని తీర్మానించారు.

కృష్ణగిరి

కృష్ణగిరి, ఫిబ్రవరి [illegible]

లోకల్‌బోర్డు హైస్కూలు టీచర్సు అసోసియేషను సమావేశమై ఉపాధ్యాయుల వేతనాలను గురించి ప్రభుత్వ నిర్ణయం చాలా అసంతృప్తిగాను, అన్యాయంగాను వుంది. గనుక వారి వేతనాలను గురించి పునరాలోచించాలని ప్రభుత్వమును కోరుతూ తీర్మానించారు.

పొగాకు కనీసధరల నిర్ణయానికి ప్రభుత్వంవద్దకు రైతుల రాయబారం

గుంటూరు, ఫిబ్రవరి 10

పొగాకు ఉత్పత్తిదారుల ప్రతినిధులు వ్యవసాయశాఖామంత్రి పి. యస్. కుమారస్వామి రాజాగారివద్దకు 8 వ తేదీ మధ్యాహ్నం రాయబారం వెళ్ళారు. ఈ రాయబారవర్గంలో గుంటూరు టొబాకో మార్కెటు కమిటీ అధ్యక్షులైన కొల్లావెంకయ్య బి. ఏ; మంతెన వెంకట్రాజు యం. యల్. ఎ (కాంగ్రెసు) కె. బ్రహ్మానందరెడ్డి యం. ఎల్. ఎ. (కాంగ్రెసు) పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఎం.ఎల్.ఎ (కమ్యూనిస్టు)గట్టుపల్లి అంజనేయులు, లావు అంకమ్మగార్లు పాల్గొన్నారు. వీరంతా పొగాకు పంటకు కనీస ధరలు నిర్ణయించబడవలసిన అవసరాన్నిగూర్చి మంత్రిగారికి నొక్కిచెప్పారు.

గుంటూరు పొగాకుమార్కెటుకమిటీవారు నియమించిన ఉపసంఘంవారు తయారుచేసిన నివేదికను మంత్రిగారికి సమర్పించారు. (ఈ నివేదికలో సూచింపబడిన కనీస ధరలు ఈ నెల 8 వ తేదీ ప్రజాశక్తిలో ప్రకటించబడినవి.)

పై సబ్ కమిటీలో మార్కెటు కమిటీ ప్రతినిధులు 5 గురు ఉన్నారు. వీరు 7 గురు వర్తకుల ప్రతినిధులను, 6 గురు రైతు ప్రతినిధులను, 4 గురు శాసన సభ్యులను, 3 గ్గురు వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులను కో-అప్టు చేసుకున్నారు. ఈ ఉపసంఘం 12 రోజులు జిల్లా అంతటా సంచారం చేసి 105 గ్రామాలనుంచి లోగట్టా సేకరించి నిర్ణయించ వలసిన కనీస ధరలను సూచిస్తూ ఒక నివేదికను తయారు చేసింది.

ఇందుపై పై రాయబారవర్గంవారు చెప్పిన విషయాలను మంత్రిగారు సావధానంగా విన్నారు. కనీస ధరలు నిర్ణయించడం అవసరమేనని అంగీకరించారు. దానిని గూర్చి అవసరమైన విచారణ చేసి రిపోర్టు యివ్వడానికి వ్యవసాయ శాఖ డాయరెక్టరు గారిని ఈ ప్రాంతాలకు పంపుతామని మంత్రి గారు అన్నారు.

పొగాకు రైతులకు బొగ్గు ఇబ్బంది

గుంటూరు, ఫిబ్రవరి. 8

పుగాకు రైతులు సకాలంలో బొగ్గు దొరకక నానాఅవస్థలు పడుచున్నారు. ఏజెంటు వద్దకెళ్ళితే కోలు కమిటీ వద్దకెళ్ళి ఆర్డరు తీసుకురమ్మంటాడు. కోలుకమిటీ వద్దకెళ్ళితే ఏజంటువద్ద బొగ్గు వున్నదేమో కనుక్కొరమ్మంటాడు. ఈ రకంగా అటూయిటూ తిరిగి కోలుకమిటీలవద్ద ఆర్డరుతెస్తే ఏజంటు వాగన్లు రాలేదు బొగ్గు లేదంటాడు. ఈ సంగతి క్యాలరీ వారికి తెలియజేస్తే కోటా ప్రకారం యిదివరకే యిచ్చాం అంటారు. యీస్థితిలో వృధాగా రైతు కాళ్ళరగ తిరిగి ఖర్చులకు వృధా డబ్బు తగలేసుకోవటం తప్ప ఒక్కపెళ్ళబొగ్గు కూడ సంపాదించలేకపోతున్నారు. కాన ప్రావిన్షియల్ కోల్ కంట్రోల్ ఆఫీసరు రైతులకు జరిగే యీ అన్యాయాన్ని అరికట్టుటకు వెంటనే పూనుకోవాలి.

వాగెనుకు తగ్గకుండా బొగ్గు తెప్పించుకునే ప్రతిరైతుకూ నేరుగా క్యాలరీ నుంచి తెప్పించుకోవటానికి అవకాశ మివ్వాలని గుంటూరు తాలూకా రైతు సంఘకార్యదర్శి కొల్లూరు వెంకటేశ్వర్లుగారు వ్రాస్తున్నారు.

నాభా సంస్థానంలో ప్రజా ఉద్యమం, అరెస్టులు

నిరంకుశ చట్టాలను ధిక్కరిస్తున్నారు

పాటియాలా, ఫిబ్రవరి 11

నాభాసంస్థానంలో ప్రజారక్షణ చట్టమనే పేర ప్రజాస్వతంత్ర నిర్మూలనం జరుగుతున్నది. అందుపై ప్రజల్లో విపరీతమైన ఆందోళన బయలుదేరింది. బ్రహ్మాండమైన ఉద్యమం పేదక్కడ సాగుతున్నది.

బహిరంగసభలు, ఊరేగింపులు ప్రభుత్వ నిషేధాలను ధిక్కరించి నడుపుతున్నారు. ప్రభుత్వంవారి లెక్కల ప్రకారం చూచినా ఇంతవరకు 228 మంది అరెస్టయ్యారు. చాలమంది విచారణలేకుండా నిర్బంధంలో ఉంచబడినారు.

నాభాకు ప్రక్కనున్న ఫరీద్‌కోట, మాలేర్ కోట్ల సంస్థానాలలో కూడ స్వతంత్ర కాముకులువచ్చి ఆ సంస్థాన ప్రభుత్వ రాక్షస చర్యలకు గురి అవుతున్నారు. ఒక్కొకరికి మూడేళ్ళవరకు కూడా కఠిన శిక్షలు పడుతున్నవి.

నేటి రాయబారాలలో లీగుకు సంబంధంలేదు

భోపాల్ సంస్థాన-లీగు తీర్మానం

భోపాల్, ఫిబ్రవరి 11

భోపాలు సంస్థాన ముస్లింలీగు నిన్న రాత్రి జరిగిన సమావేశంలో ఇలా తీర్మానించింది.

"ముస్లిముల ఏకైక ప్రతినిధిసంస్థ ముస్లింలీగు. అదిహాజరవడంలేదుగనకరాజ్యాంగసభ ఏర్పరచిన సంస్థాన రాయబార కమిటీ కేవలం "హిందూ సంస్థ." కాబట్టి దానిపై సంస్థానాలలోని ముస్లిములకు విశ్వాసంలేదు. వారుచేసుకొనే ఒడంబడికలను మేము అంగీకరించము.

"ఈ విషయాలను నరేంద్రమండలి అధ్యక్షుడు భోపాలునవాబు మనసులో ఉంచుకుంటాడని విశ్వసిస్తున్నాము"

గ్రూపింగు బలవంతంగా ఎవరూ రుద్దలేరు

గాంధీజీ ప్రసంగం

విజయనగర్, (నౌఖాలీ) ఫిబ్రవరి 11

గాంధీజీ ప్రార్థన సమయంలో కొన్ని ప్రశ్నలకు సమాధాన మిచ్చారు.

ప్రశ్న: "నేడు దేశంలోని తగాదాలను కాంగ్రెసు - లీగు, ముస్లిం-హిందూ విభేదాలకు బ్రిటిష్ మంత్రివర్గ రాయబారుల రెండు వాక్యాల పద్ధతే కారణం కదా?"

గాంధీజీ: నేను బ్రిటిష్ రాయబారులు కపటంగా ప్రవర్తించారని దూషించలేను. వారేదో ఒక పరిష్కారమార్గం న్యాయమని తలంచే చెప్పారు. అందులో బలవంతమేమీ లేదు. బ్రిటిష్ ప్రణాళికను అంగీకరించినవారు దానిని అమలుపరచకతప్పదు. అస్సాం, బెలూచిస్తాన్ లు తాము గ్రూపులలో చేరము అని పరిస్థితి వారిని ఎవ్వరూ బలవంతం చేయుటానికి బ్రిటిష్ ప్రణాళికలో ఆస్కారం కల్పించడు."

తాను హిందూముస్లిం సామరస్యం ఏర్పడినదని తెలియగానే నౌఖాలి విడిచి పోతానని గాంధీజీ చెప్పారు.

ఇంకా రౌడీలు భయ పెడుతున్నారు

బీహారులో గఫార్ ఖాన్

పాట్నా, ఫిబ్రవరి, 11

బీహారులోని షాహద్ జిల్లాలో మత కలహాలుజరిగిన తావులను ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ పరిశీలించారు. ఆయన ఇలా అన్నారు.

"ఇలాంటి ఘోరాలు మత విరుద్ధమైనవి ఇప్పటికీ ఎందరో బాధితులు దగ్ధమైనగృహాల్లో నివసిస్తున్నారు. వారికి తిండి అవసరం. ఇక్కడి అల్ప సంఖ్యాకులు నాకు పంపిన ఫిర్యాదులలో ఇప్పటికీ రౌడీల గుంపులుగా తమ్ము భయపెడుతూ తిరుగుతున్నారని తెలియ జేశారు. ఈ సంగతులను అధికారులకు తెలియ జేశారు."

కాంగ్రెస్‌సోషలిస్టులపై బీహారు ప్రభుత్వ దాడి

జయప్రకాశ్ నిరసన

గయ, ఫిబ్రవరి, 11

కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ నాయకులు జయప్రకాశ్ కాంగ్రెస్ సోషలిస్టు నాయకుల బీహార్ ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ప్రకటన చేశారు.

"ఝరియాగనుల ప్రదేశంలోపనిచేస్తూన్న బీహార్ కాంగ్రెసుసోషలిస్టుపార్టీ సేవకులందరనీ బీహారు ప్రభుత్వం అరెస్టు చేయడం ఆశ్చర్యం కలిగిస్తూంది. ఈచర్యకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్లుగా కనబడుతూంది."

ఝరియా (బీహార్) బొగ్గుగనుల యజమానుల గూండాల నుంచి కార్మికులు ఆత్మరక్షణ చేసుకోవడంలో రెండు రోజుల క్రితం ఇరుపక్షాలవారూ చాలమంది గాయపడ్డారు. ఆ సందర్భంలో బీహారు ప్రభుత్వం కార్మిక నాయకులను 12మంది వరకు అరస్టుచేసింది. వారందరూ కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి చెందినవారే.

అసెంబ్లీ సభ్యులకు పోలీసు ఆటంకం

విచారణకు స్పీకరు వాగ్దానం

బొంబాయి, ఫిబ్రవరి 11

నేడు బొంబాయి లెజిస్లేటివ్ అసెంబ్లీ హాలులో ప్రవేశిస్తూన్న కామ్రేడ్ ఎస్.ఎ. డాంగేను పోలీసులు అటకాయించారు. ఆ విషయాన్ని కామ్రేడ్ డాంగే అసెంబ్లీ స్పీకరు ముందుపెట్టి అసెంబ్లీ సభ్యులకు రక్షణ ఇవ్వాలన్నారు. పోలీసులను వుంచినది తాముకాదని, అసెంబ్లీ ఆవరణలో పోలీసుల ఆటంకం లేకుండా తాము చర్య తీసుకుంటామనీ, ప్రస్తుత ఘటనను గురించి విచారణ జరుపుతామని వాగ్దానం చేశారు.

తిరుచునాపల్లి జైల్లో

(మొదటి పేజీ తరువాయి)

"కుట్రకేసు క్రింద అరెస్టు చేయబడిన కమ్యూనిస్టునాయకులను ఇంటర్వ్యూ చేయడానికి మొన్న ఆదివారం తిరుచునాపల్లి జైలుకు వెళ్ళాను. ఖైదీలను ఇంటర్వ్యూలు చేసేపరిస్థితులు ఘోరంగావున్నాయి. దట్టంగా అల్లబడిన రెండు ఇనుపదడుల వెనుక ఖైదీలను కూర్చోబెడతారు. ఒకదడికీ మరో దడికీ రెండు గజాలదూరముంటుంది. ఇంటర్వ్యూ చేసే వారొకదడివెనుక ఖైదీలు రెండోదడి వెనుక కూర్చుంటారు. ఒకరినొకరు చూచుకోవడమే అసంభవమవుతుంది. ఇంతేగాక మాట్లాడాలంటే ఒగ్గరగా అరవాలి. ఇలా ఒక దఫామంది ఇంటర్వ్యూకి వచ్చినవాళ్ళు అరుస్తూ సంభాషణలు సాగిస్తే ఆ మాటాడేది ఎలా వినవచ్చుకుంటారో ఊహించుకోవచ్చు.

"స్పెషల్ క్లాసు ఇవ్వమని చెప్పబడే 'రాజకీయ' ఖైదీలు అనుభవించుతున్న బాధలివి: సామ్రాజ్యవాదుల పరిపాలనా విధ్యాంగా వున్న ఈ అఘాయిత్యాలను ప్రజా మంత్రివర్గ పరిపాలనలో తగదని జైళ్ళశాఖా మంత్రి గారికి తెలియపరుచుతున్నాము. ఈ అమర్యాద ప్రదర్శనను తీవ్రంగా ఖండిస్తున్నాను. అవమానకరమైన ఈ పద్ధతులను తొలగించి, సోదర దేశభక్తులైన ఖైదీల పట్ల మానవత్వంతో గూడిన సౌకర్యాలు కల్గించవలసిందని జైళ్ళశాఖా మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను."

సామ్రాజ్య అధీనదేశాల కమ్యూనిస్టుమహాసభ

వెళ్లడానికి డాక్టర్ అధికారికి కోర్టు అనుమతి

బొంబాయి, ఫిబ్రవరి 11

లండన్‌లో జరగబోయే బ్రిటిష్‌సామ్రాజ్య అధీనదేశాలకమ్యూనిస్టుసభకు వెళ్ళేందుకై 'పీపుల్సువేజ్' సంపాదకులైనడాక్టరుగంగాధర అధికారిగారికి 6 వారాల కాలం కోర్టుకు హాజరు కానక్కరలేకుండా బొంబాయి ప్రెసిడెన్సీ మాజిస్ట్రేటు అనుమతించాడు.

'ఆపరేషన్ అసైలం' అనే మిలిటరీ అధికారుల రహస్య ఆజ్ఞాపత్రాలను ప్రకటించినందుకై 'పీపుల్సువేజ్' పత్రిక ఆఫీసును సోదాచేసి ఆయనను అరెస్టుచేశారు. బెయిలు మీదవిడుదలచేశారని పాఠకులకు తెలును.

ఆయనతోపాటుగనే అరెస్టు చేయబడిన కామ్రేడ్ రమేష్‌చంద్రగార్లకు బెయిల్‌కాలం పొడిగించబడింది.

ఈ కమ్యూనిస్టుసభ విస్తృత సమావేశం ఫిబ్రవరి 26 న జరుగుతుంది. ఫిబ్రవరి 23 న బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీకాంగ్రెస్ జరుగుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇండియా, దక్షిణాఫ్రికా, కెనడా, పాలస్తీనా యిన్‌ల నుండి కొందరు ప్రతినిధులు వచ్చేశారు. సిలోన్, మలయా, ఉత్తర ఐర్లండు, న్యూజీలాండ్, పడమటి ఆఫ్రికా, పడమటి ఇండియా, దీవులనుండి ఈ వారాంతానికి ప్రతినిధులు వస్తున్నారు.

బర్మా కొండజాతులకు స్వతంత్రం ఉండాలి

ఆంగ్‌సాన్ ప్రకటన

పాంగ్‌లాంగ్, ఫిబ్రవరి 9

మొన్న బుధవారంనుంచి ఇక్కడ బర్మా పరిహద్దులలోని కొండజాతుల నాయకులు సమావేశమై చర్చిస్తున్నారు. ఆ సభలో బర్మా అంటీ ఫాసిస్టులీగు నాయకుడు ఆంగ్‌సాన్ ఇలా మాట్లాడాడు:

"స్వతంత్ర సంయుక్త బర్మాలో మీరు చేరాలని కోరుతున్నాను. మీ రెవ్వరికీ భయపడకండి. మీరు స్వతంత్రులు కావాలని ప్రకటించండి. బర్మాలాగే మీరు స్వతంత్రులు కావాలి.

"బ్రిటన్ బర్మాను విడిచిపోక తప్పదు. మీరు స్వతంత్రాని కింకా అర్హులుకారని బ్రిటన్ అంటున్నది. బ్రిటిషువారిక్రింద మీరు పడి ఉండడం మా కిష్టంలేదు. మాతో మీరు చేరాలి."

బర్మా పరిహద్దులలోని కొండజాతులను వేరుపరచి తమ పెత్తనంక్రింద ఉంచుకోవాలని బ్రిటన్ చూస్తున్నది. కొందరు కొండజాతి నాయకులతో తాము ప్రత్యేక రాష్ట్రం వాంఛిస్తున్నట్లు ప్రకటింపచేయాలని, తంటాలు పడుతున్నది.

బర్మానుండి సరిహద్దు ప్రజల తెగతెంపు

రాజీకి ఆంగ్‌సాన్ ప్రయత్నాలు

పాంగ్‌లాంగ్, ఫిబ్రవరి 11

బర్మాసరిహద్దులలోని కొండజాతుల నాయకులతో, బర్మా ప్రభుత్వానికి నడుమ ఒప్పందపత్రం తయారయిందనీ, దానిపై సమాలోచనలు జరుగుతున్నాయనీ తెలుస్తూంది. ఈ సమావేశంలో వలసదేశాల సహాయకార్యదర్శి ఎ. జి. బాటమ్లీ దగ్గర నుండి సలహాలు పొందుతున్నారట.

ఈ ఒడంబడిక తాత్కాలికం మాత్రమేనని, బర్మాప్రభుత్వ ప్రజలకు, సరిహద్దు ప్రజలకు మధ్యగల సమస్య లనేకములు పరిష్కరింపబడుతున్నాయనీ, తెలుస్తూంది.

కేంద్ర శాసన సభలో కార్మిక తగాదా బిల్లు

కార్మికప్రతినిధుల వ్యతిరేకత-త్రోసివేయబడింది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11

కార్మిక తగాదాబిల్లుపైచర్చ మరల నేడు ప్రారంభమయింది. యూరపియను సభ్యుడు గ్రిఫిత్స్‌బిల్లును సమర్థించాడు. కాని,అందులో చాలభాగం కార్యక్రమంలోకి వచ్చేటప్పటికి నిరుపయోగం అవుతుందనీ, కన్సీలియేషన్ బోర్డుల, ట్రిబ్యూనల్ నిర్మాణం వట్టి గొడవగొయ్యిగా తయారవుతుందనీ చెప్పాడు. కార్మిక ప్రతినిధి యన్.యం.జోషి చెప్పినట్లుగా కార్మికులకుసమ్మెహక్కు తొలగించ రాదన్నాడు.

శ్రీమతి మణిబెన్‌కారా బిల్లును ప్రతిఘటించింది. ఆమె ఇల్లాచెప్పింది:

"ఈ బిల్లువలన కార్మికోద్యమమూ వృద్ధి పొందదు; పరిశ్రమలలో శాంతి నెలకొనదు. కార్మికుడు పరిశ్రమ శాంతంగా జరగాలనే కోరుతాడు. తప్పనిసరి వస్తే తప్ప సమ్మెకు దిగడు. అతని ఆర్థిక పరిస్థితి అట్టిది. సమాధానపరచడానికై నేనిన సంస్థల యెడ అతడు విముఖత చూపడు. కాని, ఆరాజీ నిర్బంధంగా మీద రుద్దడానికి అంగీకరించజాలడు. కార్మికశాఖసభ్యుడు ఈ బిల్లునురద్దుచేయాలి. కార్మికోద్యమాభివృద్ధికి తోడ్పడగల మరొక బిల్లు తేవాలి. ఉభయ పక్షాల అనుమతితో రాజీ కుదిర్చే మధ్యవర్తి సంస్థల్ని నిర్మించాలి. పరిశ్రమలలో శాంతి ఏర్పడాలంటే కార్మికుని దురవస్థ తొలగించాలి. నిరుద్యోగబాధనుండి రక్షణయివ్వాలి. కార్మికునికి సంతుష్టిఉంచే దేశానికి శాంతి వుంటుంది.

"ఈ బిల్లు తెస్తూన్నవారు, సమర్థిస్తూన్న వారూ దేశంలో కలిగే అశాంతికి బాధ్యులు కాగలరు. సమ్మెలు హెచ్చుతాయి. కష్టనష్టాలు తీవ్రం అవుతాయి. ఇది నెగ్గించడం సులభమే. కాని అమలుజరపలేరు. మీరు బిల్లులో తెస్తూన్న నిర్బంధాలకు కార్మికుడు తలవొగ్గడు."

కార్మిక నాయకుడుగా చలామణి అవుతూన్న దివాన్ చమన్‌లాల్ బిల్లును సమర్థించాడు. "రాజీ అనేది నిర్బంధ పూర్వకంగా ఉండరాదు," అంటూనే కార్మికులను రాజీకి నిర్బంధించే బిల్లును సమర్థించాడు.

ఎస్. గురుస్వామి ఇల్లా అన్నారు:

"ప్రజోపయోగకరములంటూ పరిశ్రమలను నిర్వచించేటప్పుడు కార్మికులకు అన్యాయం జరుగకుండేటట్లుచూచివుంచేనేమబిల్లును సమర్థించే వాడినే. సానుభూతి సమ్మెలను రాజకీయ సమ్మెలను చేసేటందుకు కార్మికులకు అధికారం వుండాలి. బిల్లులోని శిక్ష భాగం రద్దు చేయబడాలి. జీవిత భీమాలు మొదలైన సౌకర్యాలు తయారుచేయబడాలి. ఇది 1929లో చేసిన బిల్లుకంటే ఏమాత్రమూ భిన్నంకాదు. బిల్లు ప్రకారం నియమింపబడే 'వర్క్సుకమిటీ' సమ్మెల విధ్వంసానికి మాత్రమే ఉపయోగపడుతుంది. అటువంటి కమిటీని నియమించేటప్పుడుకార్మికసంఘాల అంగీకారంకూడా తీసుకుందేమా, చట్టరీత్యా ఆ కమిటీలకు అధికారాలేమన్నా యిస్తేమా తప్ప అది నిరుపయోగం."

'నేను పట్టిన కుందేలుకు మూడు కాళ్లే'

కార్మిక ప్రతినిధులంతా ప్రతిఘటించింది, బిల్లు కార్మికులకు ఏవిధంగా నష్టకరమో రూపించినా కార్మిక సభ్యుడు జగజీవనరాం తాపట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్నట్లు తాను చెప్పిన బిల్లును కార్మికులు చాలా మెచ్చుకుంటారని చెప్పాడు. దానినేమీ మార్చనని లేదన్నాడు. కార్మిక క్షేమకరమైన చట్టాలు త్వరలోనే చేయగలమని చెప్పుతున్నాడు.

కార్మిక ప్రతినిధులయిన ఎన్. ఎమ్. జోషి, మణిబెన్‌కారా, గురుస్వామిగారలు ప్రతిఘటించినా అధిక సంఖ్యాకులవోటుతో బిల్లు చర్చకు పెట్టబడింది.

'ప్రజావసరశాఖలని' నిర్వచింపబడే పరిశ్రమలను నిర్ణయించాలంటూ ఎన్. ఎమ్. జోషి తెచ్చిన సవరణ త్రోసివేయబడింది.

రైల్వేలను 'ప్రజావసర పరిశ్రమలుగా' రిగణించరాదని ఎన్. ఎమ్. జోషి తెచ్చిన మరొక సవరణపై చర్చ జరుగుతూంది.

సభ నేటికి ముగించి రేపటికి వాయిదా వేశారు.

బర్మాలో సమ్మెలు

రంగూన్, ఫిబ్రవరి 11

ప్రస్తుతం సమ్మెచేస్తూన్న రేవుపనివారి యొక్క, ఇతర కార్మికులయొక్క కోర్కెలను వెంటనే పరిష్కరించకపోతే తాముకూడా సమ్మెచేస్తామని బర్మాపోలీసులు, ప్రభుత్వ గుమాస్తాల యూనియన్లు ప్రకటించాయి.

బ్రిటన్‌లో బొగ్గుకరువు అవకాశంగా తీసుకొని చర్చిల్ చిందులు

లండన్, ఫిబ్రవరి 11

ఇంగ్లాండులో మంచు ఈవేళ మరీ తీవ్రముగా ఉంది. నిన్న, మొన్న మిట్ట మధ్యాహ్నం పూట ఉష్ణం కొద్దిగా హెచ్చింది. కాని ఈవేళ హెచ్చలేదు సరిగదా, మరీ తగ్గింది.

విద్యుచ్ఛక్తిఉపయోగాన్ని తగ్గించడంవల్ల నిన్న కొన్నివేల టన్నుల బొగ్గు నిలవ అయింది. ఈవేళ విద్యుచ్ఛక్తి ఉపయోగాన్ని మరికొంత తగ్గిస్తూ ఉత్తరువులు చేశారు. స్కాట్లండులోకూడా ఈ తగ్గింపును అమలు జరిపారు.

మంచుపై దాడి

చాల కష్టంమీద కొన్ని బొగ్గుబళ్ళను వివిధ ప్రదేశాలకు చేర్చడానికి ప్రయత్నించుతున్నారు. లోగడ యుద్ధాల్లో ఉపయోగించిన మంటలను వెదజల్లే టాంకులను ఇప్పుడు రైలు పట్టాలమీది మంచును కరిగించడానికి ఉపయోగించేటందుకు ఆలోచిస్తున్నారు. ఎక్కువ విద్యుచ్ఛక్తి ఉత్పత్తికోసం జలాంతర్గాముల్లోని ఇ.జన్లను విద్యుచ్ఛక్తి కేంద్రాలకు కదుపుతున్నారు.

ఈవేళనుంచి పత్రికాయజమానులు తక్కువ పేజీలను ప్రచురించడానికి నిర్ణయించుకున్నారు

చర్చిల్ చిందులు

దేశంలో ఏర్పడిన బొగ్గుకరువుపై నిన్న కామన్సుసభలో చిన్న చర్చజరిగింది.

చర్చిల్ చర్చను ప్రారంభించాడు. బొగ్గుకరువు ప్రజలలో తీవ్రమైన ఆగ్రహాన్ని కలిగించిందన్నాడు. "ఈ ఆగ్రహాన్నంతటినీ యిప్పుడున్న ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఉపయోగిస్తే అందరం బ్రతికిపోతాము," అని అన్నాడు. ఇదంతా లేబరుప్రభుత్వం అనుసరిస్తున్న సోషలిస్టు కార్యక్రమం పరిణామమనీ, "సోషలిజం అంటేనే దుష్పరిపాలన, మన జాతీయజీవనం విచ్ఛిన్నం అయిపోవడమ"అని తన అక్కసునంతటినీ వెళ్ళగ్రక్కాడు.

అటానాళాళ మంత్రి విశ్వాసరాహిత్య తీర్మానం పెట్టమని చర్చిల్‌ని సవాల్‌చేశాడు. 'అది మరొకప్పుడు చేస్తానులే' అని చర్చిల్ తప్పుకున్నాడు.

తప్పిపోయినాడు

నాకుమారుడు వెంకటేశ్వర్లు అనే 11 సంవత్సరాల కుర్రవాడు తప్పించుకొని పోయినాడు. గుర్తులు—కళ్లుపెద్దవి, తలకాయలావు, చామనచాయ కనిపించితే ఈక్రింది అడ్రసుకు తెలియజేయప్రార్థన.

కోగంటి నాగయ్య
తెనాలి (తాలూకా)
కొల్లిపర పోస్టు

Edited, Printed & Published by Katragadda Rajagopala rao at the Prajasakti Press, Moghalrajapuram, Bezwada Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE